

గంజాయి రవాణా చేస్తున్న టీడీపీ కార్యకర్త అరెస్ట్


ముద్దాయి రెడ్డప్ప(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి శాంతిపురం: అధికార పార్టీ టీడీపీకి చెందిన కార్యకర్త ఒకరు గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. శాంతిపురం మండలం కనమాకులపల్లె గ్రామానికి చెందిన బీసీ రెడ్డప్పను ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని గంజాం జిల్లా బెర్హంపురంలో ఇటీవల స్థానిక పోలీసుల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రెడ్డప్ప లారీ యూఎల్ 4509 పేరుతో నంబర్ ఉండగా పోలీసులు వాహనాన్ని అడ్డుకున్నారు. దేశంలో ఎక్కడ యూఎల్‌తో రాష్ట్ర రిజిస్ట్రేషన్ లేకపోవడంతో అనుమానించిన పోలీసులు తనిఖీలు చేయగా లారీలో 50కిలోల గంజాయి లభించింది. దీంతో రెడ్డప్పను పోలీసులు అదుపులోకి తీసుకొని లారీతో సహా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సదరు నిందితుడు రెడ్డప్ప గత కొన్నేళ్లుగా కుప్పం నియోజకవర్గం పరిధిలో గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు తీర్చండి..

- కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు
- వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : కలెక్టర్
- పిజిఆర్ఎస్‌కు 289 వినతులు


వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినుతల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.యస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను 289 కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టరు జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అలాగే డిఆర్ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ అనుపమ వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తంగా 289 అర్జీలు అందగా ఇందులో శాఖల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 251, పోలీస్ శాఖ 2, పంచాయతీరాజ్ 1, వయోవృద్ధుల సంక్షేమ శాఖ 1, పౌరసరఫరాల శాఖ 2, జిల్లా కారాగారం శాఖ 1, డిఆర్‌డిఏ 31.

చికిత్స కంటే నివారణే మేలు..

సీజనల్ వ్యాధుల వ్యాప్తి కట్టడికి చర్యలు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధుల వ్యాప్తిని కట్టడికి వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లాలో కీటక జనిత వ్యాధుల నిర్మూలనపై ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లు, జడ్పీ సీఈవో, ఆరోగ్యశాఖ, సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఇతర సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు అధికారికంగా కొన్ని డెంగీ కేసులు నమోదు కావడం జరిగిందని, ఈ సంఖ్య మరింత పెరిగే ఆకాశం ఉందని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వ్యాధి కట్టడికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే అమలు చేయాలని, ఇందులో భాగంగా మురుగు నీరు తొలగించడం, తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడం, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడంతో పాటు, జనావాసాలు అధికంగా ఉన్న ప్రదేశాలు, వ్యాధులు ప్రబలే ప్రదేశాలలో వ్యాధి నిర్మూలన పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రిలో చేరే వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించి వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాలలో పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలన్నారు. గ్రామాలలో ఏఎన్ఎంలు, ఆశాలు, ఎస్‌హెచ్‌జీకు, పంచాయతీ సెక్రెటరీలతో కమిటీ ఏర్పాటు చేసి పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన చర్యలు చేపట్టాలన్నారు. ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాధుల నిర్మూలనకు చేపట్టిన చర్యలను నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. మేజర్ పంచాయతీలలో, కనెక్టింగ్ రోడ్‌ల వద్ద చెత్త నిల్వలను గమనించి, ప్రజాప్రతినిధుల సహాయంతో చెత్తను తొలగించాలని ఎంపిడిఓలను ఆదేశించారు. గత రెండు నెలల్లో నమోదైన డెంగీ కేసుల వివరాలను సమర్పించాలని డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. చివరగా ఈనెల జాతీయ డెంగీ నివారణ మాసం సందర్భంగా గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, పంచాయతీ రాజ్ శాఖ అధికారి, శ్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి, జిల్లా పరిషత్ శాఖ అధికారి, నీటిపారుదల శాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎంపీడీవోలు, వి కోట ఎంఆర్ఓలు, సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


డెంగీ నివారణ మాసోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు

పరిష్కారంలో అలసత్వం చేయకండి

చిత్తూరు అర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్‌పి తెలిపారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 36 ఫిర్యాదులు అందాయి. హత్యాప్రయత్నం 2, చీటింగ్ 3, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 2, భూ తగాదాలు 13, డబ్బు తగాదాలు 7, దారి సమస్యలు 1, ఆస్తి తగాదాలు 4, బెదిరింపులు 1 ఉన్నాయి.


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్‌పి

8 వినతులు స్వీకరించిన కమిషనర్

చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, సంబంధిత నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాఖ 4, పింఛను 3, రెవెన్యూ 1 చొప్పున మొత్తం 8 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్

అట్టడుగు కుటుంబాల అభివృద్ధికి 'పి-4'



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పి -4 పథకం ద్వారా సమాజంలో ఆర్థికంగా బలంగా ఉన్న వారు స్వచ్ఛందంగా అట్టడుగునున్న కుటుంబాలు, వ్యక్తులు, గ్రామాల అభివృద్ధిలో తోడ్పడే అవకాశాన్ని కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలో పి- 4 కార్యక్రమంకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. సమాజంలో ఆర్థికంగా బలంగా ఎదిగిన వారు అట్టడుగున ఉన్న బడుగు వర్గాలకు సహాయం అందిస్తే అసమానతలు తొలగుతాయని సమాజంలో సమానత్వం నెలకుంటుందని ప్రతి ఒక్కరూ వెల్తీ, హెల్దీ, హ్యాపీ చిత్తూరు పౌరులుగా జీవించగలుగుతారని అన్నారు. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి సహాయం చేయాలన్నారు. సామర్థ్యం ఉన్నవారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేసి, ఈ పథకం పూర్తిగా వాలంటరీ, అంటే స్వచ్ఛందమే, ఎవరూ ఎవరినీ బలవంతంగా ఇందులో చేర్చడం లేదని తెలిపారు. మార్గదర్శకులు కూడా వారిని దత్తత తీసుకోవాలని ప్రభుత్వం వారిని స్వచ్ఛందంగా ఈ పథకంలో భాగం కావాలని తెలిపారు. అలాగే పీ-4 పథకంలో పాల్గొంటున్న అన్ని శాఖల ప్రభుత్వాధికారులు కూడా దీన్ని వాలంటరీ ప్రోగ్రామ్‌గా మాత్రమే చూడాలని ఎటువంటి బలవంతం లేకుండా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఓ డిఈఓ, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పిఓఎస్‌హెచ్' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళలను విధులు నిర్వహించే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నుండి కాపాడే పిఓఎస్‌హెచ్ చట్టంపై మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం ఈకార్యక్రమంకు సంబంధించిన పోస్టర్, అడాప్షన్‌లకు సంబంధించి వాల్ పోస్టర్‌లను జిల్లా కలెక్టర్ పిజిఆర్ఎస్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, డిఆర్ఓ మోహన్ కుమార్, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి పాల్గొన్నారు.

'ఉసురే' ట్రైలర్ వీక్షించిన ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొని ఆగస్టు 1న విడుదల కానున్న 'ఉసురే' సినిమా ట్రైలర్, పాటను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వీక్షించారు. సోమవారం లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో చిత్రనిర్మాత మౌళి రాధాకష్ణ ట్రైలర్‌ను ఎమ్మెల్యేకి చూపించారు. ప్రముఖ నటి రాశి, గురజాల జగన్ మోహన్, అసురన్ ఫేమ్ టీజీ అరుణాచలం, బిగ్‌బాస్ ఫేమ్ జనని తదితరులు నటించిన ఈ సినిమాకు చిత్తూరుకు చెందిన నవీన్ డి గోపాల్, మౌళి రాధాకృష్ణ దర్శక నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సినిమా ట్రైలర్, పాట బాగుందని.. తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ సంస్థ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలోని 18 నుండి 27 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఇంటర్, డిగ్రీ, ఉన్నత చదువులు పూర్తి చేసుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఎమ్మెస్ ఆఫీస్, వర్డ్, ట్యాలీ, రంగంలో వెబ్ డెవలపర్, టెలికాం రంగంలో బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్ కోర్సులో 90రోజుల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందే వారికి ఉచితంగా హాస్టల్ సదుపాయం, భోజనం, యూనిఫాం శిక్షణకు కావలసిన మెటీరియల్ ఇస్తున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్వ్యూలకు అవసరమైన శిక్షణా అందించడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం కోర్స్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు మెట్రో నగరాలైన హైదరాబాద్, బెంగళూరులో ప్రైయివేట్ సెక్టార్‌లో అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య భవనానికి భూమి పూజ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో సంతపేట బజారు వీధిలో ఆర్యవైశ్య సంఘం నిర్మించే భవనానికి సోమవారం ఉదయం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ భూమి పూజ చేశారు. పునాది నిర్మాణానికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ టిడిపి పరిశీలకులు సునీల్ కుమార్ చౌదరి, స్థానిక నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, సంతపేట డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమీపంలోని 48వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు నమోదు పరిశీలించి సమయపాలన పాటించాలన్నారు. వార్డు పరిధిలో సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.


ఆర్యవైశ్య భవనానికి భూమిపూజ చేస్తున్న ఎంఎల్‌ఏ గురజాల

మామిడి రైతులకు రూ.150 కోట్ల సబ్సిడీ

పారదర్శకంగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పారదర్శకంగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని ప్రత్యేక సమావేశం మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఉద్యానశాఖ డిడి మధుసూదన్, అగ్రికల్చర్, ఉద్యానవన, సెరికల్చర్, మండల స్థాయి అధికారులతో మామిడి పంటను వివిధ ఫ్యాక్టరీలకి తరలించిన రైతులు జాబితా సమగ్ర సర్వేపై వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నివేదికపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన మామిడికి రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రూ.4లు సబ్సిడీ మొత్తం రూ.150కోట్లు రైతులు ఖాతాలకు జమచేయడం జరుగుతుందని తెలిపారు. తోతాపురి మామిడి రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందని తెలిపారు. జూన్ నెల వరకు సేకరించిన మామిడికి సంబంధించి సబ్సిడీ జూలై నెలలో, అలాగే జూలై నెలలో సేకరిస్తున్న మామిడికి సంబంధించి సబ్సిడీ ఆగస్టు నెలలో రైతులు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ లోపు అన్ని రికార్డులు నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. రైతుల బ్యాంకుల ఖాతాలకు సంబంధించి బ్యాంక్ వివరాలు, ఐఎఫ్ఎస్‌సి కోడ్, ఈ క్రాప్ పంటలను పరిశీలించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు తరలించిన మామిడి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర అందజేస్తుందని తెలిపారు. అటువంటి నివేదికలు జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియ జాగ్రత్తగా అంశాలను దృష్టిలో పెట్టుకొని, రైతుకు ఈక్రాపింగ్ జరిగిందా లేదా పరిశీలించాలి, ఆధార్ కార్డు అనుసంధానం అయ్యిందా లేదా పరిశీలించాలి, వేపగుంట, కార్వేటినగరం నింద్ర, పులిచెర్ల, మండలాల వ్యవసాయ అధికారులతో సమీక్షించారు, పూతలపట్టు, పుంగనూరు, నియోజకవర్గాలకు సంబంధించిన మామిడి పంటను ఫ్యాక్టరీలకు తరలించిన రైతులు జాబితా సమగ్ర వివరాలను పొందుపరచాలని తెలిపారు,వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్ అధికారులు ఈ సర్వే ప్రక్రియలు పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ, మార్కెటింగ్ ఏడి పరమేశ్వరన్, తదితరులు పాల్గొన్నారు.

'మనేంద్రం' ఎంపిటిసి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల..!



ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలం మనేంద్రం ఎంపిటిసి స్థానానికి గాను ఎన్నికల నిర్వహణకు సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. రామకుప్పం మండలంలో 16 ఎంపిటిసి స్థానాలు ఉండగా 2021లో ఎన్నికలు నిర్వహించి అన్ని స్థానాలు పూర్తి చేశారు. అయితే మనేంద్ర సెగ్మెంట్ ఎంపిటిసిగా గెలుపొందిన శాంత కుమారి ఎంపిపిగా ఎన్నికైన అదే సంవత్సరం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుండి ఈ ఎంపిటిసి స్థానం ఖాళీగా ఉండగా తాజాగా సోమవారం రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నీలం సాహ్ని ఎన్నికలకు అనుమతులు విడుదల చేశారు. జులై 30వ తేదీ నుండి ఆగష్టు 1వ తేదీ వరకు నామినేషన్‌లు స్వీకరణ, ఆగష్టు 2న నామినేషన్‌ల పరిశీలన, 5న ఉప సంహారణల అనంతరం తుది జాబితా, 12న ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. 14వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అదేరోజు ఫలితాలు ప్రకటించడం జరుగుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

లబ్ధిదారుల తొలగింపు కుట్ర

- ఎఫ్ఆర్ఎస్ టార్గెట్లు...సిడిపిఒల ఒత్తిళ్లు
- నెట్‌వర్కు పనిచేయక అంగన్‌వాడీల ఫీట్లు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ (ముఖ ఆధారిత గుర్తింపు) అంగన్‌వాడీలకు ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్కు పనిచేయకపోవడంతో ఎఫ్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తికావడం లేదన్నది అంగన్‌వాడీల ఆవేదన. అయితే ఖచ్చితంగా ఆన్‌లైన్ చేయాల్సిందేనని సిడిపిఒలు అంగన్‌వాడీల మెడపై కత్తి పెట్టి ఒత్తిడి చేస్తున్నారన్న విమర్శలున్నాయి. 'గర్భిణులు, బాలింతలు, ఆర్నెళ్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోం రేషన్' సేవలు పొందాలని షరతు పెట్టారు. అంగన్‌వాడీల మొబైల్ ఫోన్ ద్వారా మంత్రిత్వ శాఖ 'పోషణ్ యాప్'లో లబ్ధిదారుల ముఖ గుర్తింపు వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలి. ఎఫ్ఆర్ఎస్ రిజిష్టర్ కాని వారికి టేక్ హోం రేషన్ ఇవ్వబోరని ఆదేశాలున్నాయి. ఈ ఎఫ్ఆర్ఎస్ అంతా లబ్ధిదారుల తొలగింపు కుట్రలో భాగమేనని అంగన్‌వాడీ యూనియన్లు మండిపడుతున్నాయి. ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామన్న బెదిరింపులు ఉంటున్నాయి.

ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 24 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 4,192 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ప్రీస్కూల్ 3 నుంచి ఐదేళ్ల పిల్లలు ప్రస్తుతం 82,809 మంది ఉన్నారు. తిరుపతి జిల్లాలో 2,731 మంది అంగన్‌వాడీలు ఉన్నారు. మినీ వర్కర్లు 345 మంది ఉన్నారు. హెల్పర్లు 2,076 మంది ఉన్నారు. గర్భిణులు 7,986మంది, బాలింతలు 6,621 మంది లబ్ధి పొందుతున్నారు. ఆరు నెలల క్రితం ఎఫ్ఆర్ఎస్ పూర్తి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రకారమే గర్భిణులు, బాలింతలు, ఆర్నెళ్ల నుంచి మూడేళ్ల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోం రేషన్ సేవలు పొందాలని షరతు విధించింది. ఎఫ్ఆర్ఎస్ రిజిష్టర్ కాని వారికి రేషన్ ఇవ్వబోరని స్పష్టం చేసింది. ఐసిడిఎస్ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారుల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తి కాని వారిని రద్దు చేయాలని సిడిపిఒల ఆదేశాలు. లేకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హుకుం జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ పూర్తి కాని వారిని తొలగిస్తే అంగన్‌వాడీ వర్కర్లపై లబ్ధిదారులు గొడవకు దిగే అవకాశాలు ఉన్నాయి. ఎఫ్ఆర్ఎస్ అయినా పూర్తి చేయాలని, లేకుంటే లబ్ధిదారులనైనా తొలగించాలని అంగన్‌వాడీలపై తీవ్ర ఒత్తిడి ఉంది.

ఎఫ్ఆర్ఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ



ఎఫ్ఆర్ఎస్ వెంటనే రద్దు చేయాలి. ఈ పద్ధతి పెట్టడం వల్ల అంగన్వాడి సిబ్బందితోపాటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడి సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ట్యాబ్లు, ఫోన్ సౌకర్యం కల్పించాలి. ఎఫ్ఎస్ఆర్ వల్ల మారుమూల గ్రామాల్లో నెట్‌వర్కు సరిగా పనిచేయక ఇబ్బందులకు గురి అవుతున్నాం. ఓటిపిలు సక్రమంగా రాకపోవడంతో లబ్ధిదారులు తమపై కోపం చేసుకుంటున్నారు. అన్నింటికి కలిపి ఒకే యాప్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఎఫ్ఆర్ఎస్ లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ రెండు దశల్లో చేపట్టాలి. తొలుత మొబైల్లో లబ్ధిదారుల ఫొటో తీయాలి. రెండోది లబ్ధిదారుని ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్‌కు వచ్చే ఒటిపిని వెరిఫై చేయాలి. దీనిలో విఫలమైతే లబ్ధిదారులను జాబితా నుంచి తొలగిస్తారు. అటువంటి వారికి టేక్ హోం రేషన్ ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నాయి. గ్రామాల్లో ఎఫ్ఆర్ఎస్ పూర్తి కాని లబ్ధిదారులు అంగన్‌వాడీ వర్కర్లతో గొడవకు దిగుతున్నారు. ఈ ఎఫ్ఆర్ఎస్ అనేది ఆహార భద్రత చట్ట ఉల్లంఘనే. దీన్ని రద్దు చేయకపోతే పోరాటం తప్పదు.

ట్రైనింగ్ ఎస్ఐగా అశోక్ కుమార్ నాయక్

ప్రజాశక్తి - బంగారు పాల్యం: ట్రైనింగ్ ఎస్ఐగా అశోక్ కుమార్ నాయక్ బంగారుపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా ఎంపికైన ఎస్ఐగా శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం విధుల నిర్వహణలో ఐదు నెలల పాటు ఆయన శిక్షణలో కొనసాగుతారని తెలిపారు.



తూగుండ్రం వీఆర్‌వో బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీ వీఆర్‌వో గా కె ప్రభావతి సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఆమెకు సచివాలయ సిబ్బంది స్వాగ తం పలికి శు భాకాంక్షలు తెలిపారు.



ఛాంపియన్ షిప్ గెలుచుకున్న పిఇఎస్ పబ్లిక్ స్కూలు విద్యార్థి భార్గవ సాయి

పీఈఎస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- యాదమరి: విజయవాడలో ఇటీవల నిర్వహించిన అబాకస్ పోటీల్లో యాదమరి మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ఛాంపియన్ షిప్ కైవశం చేసుకున్నారు. ఈనెల 26వ తేదీ విజయవాడ ప్రముఖ కన్వెన్షన్‌లో నిర్వహించిన సిప్ అబాకస్ పోటీలలో సుమారు 1100 మంది విద్యార్థులు పాల్గొని ఐదు నిమిషాల్లో 120కి పైగా క్యాలిక్యులేషన్స్ చేశారు. ఈ పోటీ పరీక్షల్లో పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన ఐదవ తరగతి చదువుతున్న ఎస్ భార్గవ్ సాయి ఛాంపియన్‌షిప్‌ను కైవశం చేసుకున్నాడు. ఎనిమిదో తరగతి చదువుతున్న కె కార్తీక్ సాయి మూడవ రన్నరప్‌గా నిలిచాడు. పెర్ణిత శివాని, పివి కార్తీక్, దీక్షిత, సహిష్ణు, మోక్షజ్ఞ, ఎస్ మోహిత్, విఘ్నేష్ చౌదరి ఉత్తమ ప్రతిభ చూపి చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యాదమరి మండల పరిధిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి కృష్ణబాబు గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ ఇంత గొప్ప స్థాయికి విద్యార్థులు చేరుకోవడానికి కారకులైన సిప్ అబాకస్ నిర్వాహకురాలు శ్రీలతకి, అబాకస్ యాజమాన్యానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: స్థానిక డాక్టరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు బి అన్నపూర్ణ శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఆ కళాశాలలో డిగ్రీ ప్రవేశ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో చేరేందుకు అందుబాటులో ఉండే వివిధ కోర్సులు, బిఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులన్నీ అందుబాటులో ఉన్నాయి. చేరదలిచినవారు సంబంధించిన సర్టిఫికెట్లన్నీ ఒరిజినల్ తో పాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీలతో కళాశాలకు వచ్చి, మంగళవారం నుండి అడ్మిషన్ ప్రక్రియ ఆఫ్‌లైను, ఆన్‌లైనులో కళాశాలలో ప్రారంభమవుతుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాలకు: డాక్టరు భరణి నాథ్ రెడ్డి 9885125771, నరేంద్ర బాబు 7702917803, డాక్టరు భీమ మోహన రావు 9704425888 ఫోను నెంబర్లను సంప్రదిం చాలన్నారు.

పాత భవనాలతో గదుల కొరత

ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీపతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తమ పాఠశాలలో అన్ని సౌకర్యాలు బాగున్నాయని, అయితే పాత భవనాలు శిథిలావస్థకు చేరుకున్న కారణంగా విద్యార్థులకు గదులు కొరత తీవ్రంగా వుందని సమస్యను పరిష్కరించాలని మండలంలోని తీర్థం పంచాయతీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీపతి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాలలో పిల్లలు చదువుకోవడానికి పాఠశాల భవనాలు పూర్తి కావలసి వుందని, పాత భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్న కారణం వల్ల రూములు చాలట్లేదని, వెంటనే కొత్త భవనా లను పూర్తిచేసి అందిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. తమ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎంతో బాగుందని విద్యార్థిని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. సన్నబియ్యంతో చేసిన అన్నం, సాంబారు, కోడిగుడ్డు, స్వీటు అన్నీ బాగున్నాయని వారు తెలిపారు. స్కూల్ డ్రెస్సులు, షూలు, బ్యాగులు అన్నీ చాలా బాగున్నాయని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. తాము బాగా చదివి తమ పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెస్తామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని పాఠశాల భవనాలు పూర్తి కావలసి వుందని, పాత భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్న కారణంగా గదులు చాలట్లేదని, వెంటనే కొత్త భవనాలను పూర్తిచేసి అందిస్తే బాగుంటుందని తెలిపారు.



సమస్యలకు సత్వర పరిష్కారం: తహశీల్దారు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ డేలో వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలు వినతి పత్రాలల రూపంలో ప్రజలు అందించారు. వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు మేలు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి కళ్యాణి, వీఆర్‌వోలు, సచివాలయ సర్వేయర్‌లు పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతిపత్రాలు అందిస్తున్న వైసిపి నాయకులు

ఆలయ భూములు పరిరక్షించండి

ప్రజాశక్తి- పూతలపట్టు: ఆలయ భూములను పరిరక్షించాలని వైసిపి రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పలువురు, కార్యకర్తలు సోమవారం వినతుల దినోత్సవం సందర్భంగా తహశీల్దారు రమేష్ బాబుకు వినతులు సమర్పించారు. భీమేశ్వరాలయం, వినాయకుని ఆలయం, రాములవారి ఆలయానికి సంబంధించిన అనేక భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వీటిపై స్పందించి ఆలయ భూములను కాపాడాలని వారు కోరారు. స్పందించిన తహశీల్దారు వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే మురళీమోహన్‌ను కలిసిన ఎస్ఐ

ఎమ్మెల్యేను కలిసిన కాణిపాకం ఎస్ఐ

ప్రజాశక్తి -ఐరాల: పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టరు కలికిరి మురళీ మోహన్‌ను కాణిపాకం ఎస్ఐ నరసింహులు సోమవారం కలిశారు. కాణిపాకం ఎస్ఐగా నరసింహులు భాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం సాయంత్రం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయంలో డాక్టరు కలికిరి మురళీమోహన్‌కి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను బహుకరించారు. కాణిపాకం పుణ్యక్షేత్రంలో శాంతి భద్రతల నిర్వహణలో విఘాతం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, కాణిపాకం ఆలయానికి వేలాది భక్తులు వచ్చే నేపథ్యంలో పోలీసు విభాగం పూర్తి సహకారం అందించాలని తెలిపారు. భక్తుల సౌకర్యం, భద్రత అత్యంత కీలకమని, పోలీసుల యాక్టివ్ పాత్ర కాణిపాకం అభివృద్ధికి తోడ్పడాలి,' అని పేర్కొన్నారు.

మార్గదర్శకులను వెతికి ఒప్పించండి

పి 4 అమలుపై అధికారులకు మార్గ నిర్దేశం

ప్రజాశక్తి -వికోట : పి4 పథకం విజయవంతానికి మార్గదర్శకులను వెతికి వారిని ఒప్పించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై వుందని ఎంపీడీవో ఈశ్వరన్న తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి4 కార్యక్రమంపై మండలంలోని విఆర్‌వోలు, పంచాయతీ సచివాలయ సిబ్బందితో సోమవారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి 4 కార్యక్ర మం అమలుపై గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారని క్షేత్ర స్థాయిలో ఆర్థికంగా బలంగా ఉన్న కుటుంబాల జాబితాను సిద్ధం చేశామని వారిని ఒప్పించి గుర్తించిన నిరుపేదలను బంగారు కుటుంబాలుగా తీర్చి దిద్దేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ముఖ్యం గా సిబ్బంది తమ పరిధిలోని స్వచ్ఛంద సంస్థలు, సంపన్ను లు, భూస్వాములు, సినిమా థియేటర్, కళ్యాణ మండపాలు, పెట్రోల్ బంక్‌ల యజమానులు, పారిశ్రామిక వేత్తలను గుర్తించి ప్రభుత్వం నిర్దేశించిన పి 4 ఉద్దేశాన్ని తెలిపి వారు ఎక్కువ మందిని దత్తత తీసుకునేలా వారిని ఒప్పించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్దేశిత లక్ష్యాలను ప్రతి ఒక్కరూ తమ పరిధిలో పూర్తి చేయా లన్నారు. ఇటీవల ప్రభుత్వం సచివాలయ సిబ్బందిని, రెవెన్యూ సిబ్బందిని , ఇతర శాఖల అధికారులను బదిలీ చేయడంతో నూతన ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో తమకు ముఖ పరిచయం లేని వ్యక్తులను సంప్రదించడం, వారికి పి4 లక్ష్యాలను తెలపడంతో పాటు వారిని భాగస్వామ్యం చేయడానికి తంటాలు పడుతున్నారని ఏ విధంగా అయినా మార్గదర్శకులను ఒప్పించి బంగారు కుటుంబాల ఏర్పాటుతో పి4 లక్ష్యాలను అధిగమించాలని అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవో పీఆర్‌డి షేక్‌షావలి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



రసాయన ఎరువులు వాడకం తగ్గించాలి

జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిణి లక్ష్మీ ప్రసన్న

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రసాయన ఎరువులను తగ్గించుకుని సేంద్రియ ఎరువులను వాడకాన్ని పెంచాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిణి లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. మండలంలోని చికూరుపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు మండల వ్యవసాయ అధికారిణి భారతి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటలను సాగు చేసేటప్పుడు రసాయనిక ఎరువులు అధికంగా వాడుతు న్నారని తద్వారా పంట దిగుబడి అధికంగా వస్తుందని ఆశిస్తున్నారని నేలలోని సాంద్రత రసాయనాలతో విలీనమై మట్టి నమూనా దెబ్బతింటుందన్నారు. అందువల్ల సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేసేలా చూడాలని తద్వారా నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని వాటిని ఉపయోగించడం వల్ల మనుషులు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. అనంతరం పెరట్లో సాగు చేసే పంటలకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సాయిజ, కుమార్ పలువురు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ అధికారిణి లక్ష్మీ ప్రసన్న

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - యాదమరి: మండలంలోని కె గొల్లపల్లి ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థుల చిత్తూరు జిల్లా సాక్షరత సమితి ఉద్యోగి విశ్రాంత ఉపాధ్యాయులు త్యాగరాజు నాయు డు సోమవారం వితరణ చేశారు. కె గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులు సుమారు 75 మందికి రూ.10 వేల రూపా యలు విలువచేసే స్టడీ మెటీ రియల్ ను దాత త్యాగరాజు నాయుడు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఏపీ లలిత మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం జిల్లా సాక్షరత సమితిలో ఎలాంటి వేతనం లేకుండా పనిచేస్తూ జిల్లా వ్యాప్తంగా వయోజన విద్య కోసం కృషి చేస్తున్న త్యాగరాజు నాయుడు, ప్రతినెలా తనకు వచ్చే పింఛను నుండి కొంత మొత్తాన్ని పొదుపు చేసి పేద విద్యార్థులు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థు లకు సహాయపడుతున్నారని వారి సేవను అభినందిస్తున్నామన్నారు. త్యాగరాజునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లి బాగా చదువుకొని తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు సంపాదించి జీవితంలో అందరూ మంచి ఉద్యోగాలు సంపాదించి స్థిరపడాలని ఆశిస్తున్నానని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి పాఠశాల ఉపాధ్యాయ బృందంచే ఘన సత్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, భాస్కర్ రెడ్డి, సుల్తాన్ మదన్ మోహన్ రెడ్డి, చిన్న దొరై, మధుబాబు, దామోదర్ రెడ్డి, రంగనాథం, భారతి, మంజుల, మహేష్, షణ్ముగం పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌ను అందించిన దాత త్యాగరాజునాయుడు

మండల సమావేశం ప్రశాంతం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఎంపీపీ రోజా అధ్యక్షతన సోమవారం 2 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి ఆబ్కారి శాఖ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తప్ప మిగిలిన అన్ని శాఖల అధికారులు హాజ రయ్యారు. ఆబ్కారీ శాఖ గైర్హాజరు కావడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తు న్నారు. ఇటీవల బ్రాందీ షాపుల్లో అవకతవకలు, సిండికేట్లు, బెల్టు షాపులను ప్రజాప్రతినిధులు నిలదీస్తారని వాపో తున్నారు. మిగిలిన వారు వారి శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ స్వచ్ఛత, పరిశుభ్రత విధిగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గ్రామ కమిటీలు కీలకంగా పని చేయాలి: ఎంపిపి

ప్రజాశక్తి - రొంపిచర్ల: గ్రామ కమిటీలు కీలకంగా పనిచే యాలని ఎంపిపి చిచ్చిలి పురుషోత్తం పిలుపునిచ్చారు. రొంపిచర్ల మండలం మోటు మల్లెల నగిరిలో సోమవారం వైసిపి కార్యకర్తల సమావేశం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలు కీలకంగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించడంపై ప్రజలకు వివరించాలని నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సభ్యులకు వివరించారు. 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకొని వెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రజలను మోసం చేసిన కూటమి పార్టీకి బుద్ధి చెప్పాలని, ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీసే విధంగా తయారు చేయాలన్నారు. రాబోవు రోజులలో వైసిపి కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని తెలిపారు. దీన్ని కార్యకర్తలు దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చెంచు రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనాథ నాయుడు, విజయ శేఖర్, కరీముల్లా, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



వెలుగు నిర్వహణలో వెనుకబడ్డ ఎస్ఆర్‌పురం

జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిపుష్టి కోసం ఏర్పాటు చేసిన వెలుగు డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహణలో, రికవరీలో ఎస్ఆర్ పురం మండలం జిల్లాలోని వెనుకబడి ఉందని గత కొన్ని నెలలుగా మండలంలో పనితీరు సక్రమంగా లేదని గుర్తించిన జిల్లా స్థాయి అధికారులు సోమవారం వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలు గ్రూప్ లీడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆశ్చర్యపరిచే నిజాలు వెలుగులోకి వచ్చాయి. రికవరీలో మండలం అధ్వానంగా ఉందని వెలుగు సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం ,మండల స్థాయి వెలుగు అధికారి వీరిని సమన్వయ పరచడం విఫలం కావడంతో రికవరీ శాతం పూర్తిగా తగ్గిపోయిందని అధికారులు గుర్తించారు. ఈ రికవరీ శాతాన్ని తిరిగి ఎలా పెంచాలి అన్న దీనిపై జిల్లా స్థాయి అధికారులు సంఘ మిత్రులు, గ్రూప్ లీడర్ల తో చర్చించారు. సంఘమిత్రలకి నెలవారి ఇచ్చే జీతాలు ఒక్కొక్కరికి రెండు నెలలు, మూడు నెలలు ఆన్‌లైనులో పెట్టలేదని సంఘమిత్రలు ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ కూడా కొన్ని నెలలు జీతం ఆపినట్లు ఈ సందర్భంగా అధికారులు దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఇలా అయితే వెలుగు శాఖ ఎలా ముందుకు సాగుతుంది అన్న రీతిలో కొంతసేపు చర్చించారు. మండల స్థాయి వెలుగు అధికారి సిబ్బందితో సమన్వయంగా లేకపోవడం దీంతో పాటు ఏకపక్షంగా వ్యవహరించడం వల్ల సంఘమిత్ర జీతాలు ఆగిపోయాయని, ఆపరేటరు జీతం ఆపేసారని విచారణలో తేలింది. సమన్వయం లేకపోవడంతోనే పనితీరు తగ్గిందని రికవరీ శాతం కూడా తగ్గిందని తేలింది. ఆపేసిన జీతం ప్రభుత్వం నుంచి తిరిగి వచ్చే సూచనలు లేవని తేల్చారు. అందరూ కలిసి పనిచేయాలని అలాంటప్పుడే రికవరీలు శాతం పెంచవచ్చని సిబ్బంది రికవరీ కోసం నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా స్థాయి అధికారులు వెలుగు మండల స్థాయి అధికారికి మరియు సంఘ మిత్రులకు సూచించారు. శ్రీనిధి నిధులను విడుదల చేయాలని సంఘమిత్రలు వివో లీడర్లు జిల్లా స్థాయి అధికారులను అడిగారు. ఉన్నతి, శ్రీనిధి, బ్యాంక్ లింకేజీ, పంచాయతీల వారీగా గ్రామ సంఘాల నుంచి రావాల్సిన బకాయిలు గ్రామ సంఘాల వద్ద ఉన్న నిధులు గురించి కూలంకుషంగా చర్చించారు. సమన్వయంతో ముందుకు సాగితేనే డ్వాక్రా సంఘాలు తమ ఉనికిని జరుపు కుంటాయని ఎస్ఆర్ పురం మండలంలో మండల స్థాయి వెలుగు అధికారి నుంచి వివో లీడర్ల వరకు అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని అందుకోసమే సోమవారం గ్రీవెన్స్ ఉన్న జిల్లా స్థాయి నుంచి ముగ్గురు అధికారులు ఎస్ఆర్ పురం మండలంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కేటాయించామని జిల్లా స్థాయి అధికారులు సంఘ మిత్రులకి వివో లీడర్లకి సూచించారు ఈ కార్యక్రమంలో డిపిఎం ఫైనాన్స్ రవికుమార్ ఐపిడిపీఎం సునీత కుమారి సిపిఓ ఏపిఎం శ్రీహరి, ఏపీఎం రోజా, సంఘమిత్రలు వివో లీడర్లు పాల్గొన్నారు.



ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

పజాశక్తి - రొంపిచర్ల: ఓపోన్ స్కూలులో అడ్మిషన్లను సోమవారం సీఎంవో ప్రారంభించారు. బడి మధ్యలోనే మానేసిన విద్యార్థు ల కోసం ప్రభుత్వం ఓపెన్ స్కూల్స్‌ను మంజూరు చేసింద న్నారు. సోమవారం రొంపిచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లను సీఎంఓ ప్రారంభించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదు వుకోవాలనుకున్న విద్యార్థు లు ఆదివారం పాఠశాలకు వచ్చి, చదువుకుని పరీక్షలు రాయవచ్చు నని పేర్కొ న్నారు. వీరికి ఐదు సబ్జెక్టులు మాత్ర మే ఉంటాయని తెలిపారు. ఓపె న్ స్కూల ఎలో చదువు కున్న విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బడి మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈ ఓ డి శ్రీనివాసులు, బాలు ర ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు ధనలక్ష్మి, రెడ్డి రమేష్, సుజాత, మహమ్మద్ అలీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పా ల్గొన్నారు.



ఓపెన్ స్కూలు అడ్మిషన్లను ప్రారంభిస్తున్న సీఎంవో

క్రైం న్యూస్



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బొలెరో.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పలమనేరు: ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ దుగ్గినవారిపల్లి గ్రామానికి చెందిన రెడ్డప్ప, వదిన నీలమ్మ, నీలమ్మ కుమార్తె లలిత వీళ్లు ముగ్గురు లలితకు జ్వరంగా ఉందని పలమనే ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుండగా నాగ మంగళం వద్ద వెనక నుండి బొలెరో వాహనం ఢీకొంది. రెడ్డప్పకు తలకు, కాళ్లకు, చేతులు బలమైన గాయాలు, నీలమ్మకు నడుం ఫ్రాక్చర్ అయ్యాయి. కాళ్ల చేతులు తలకు బలమైన గాయాలు అయ్యాయి. లలితకు కుడిచేయి విరిగింది. తలకు, నడుముకు కాళ్లకు బలమైన గాయాలైనట్లు రెడ్డెప్ప తెలిపారు. బొలెరో వాహనదారుడు మద్యం మత్తులో వాహనం నడిపినట్లు తెలిపారు. మిగతా విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

కర్ణాటక మద్యం పట్టివేత

వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -పలమనేరు: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. పలమనేరు పట్టణంలోని మార్కెట్ సమీపంలో కనకదుర్గ వీధిలో వుంటున్న ఎస్ సుబ్రహ్మణ్యం అక్రమంగా 23 ప్యాకెట్‌ల కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని పలమనేరు పోలీసులు తెలిపారు.


క్వారీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

అక్రమ క్వారీని అడ్డుకోవాలి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : క్వారీకి సంబంధించిన అనుమతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా తప్పుడు రిపోర్టుల ద్వారా అనుమతి ఇచ్చినందుకు ఆ ప్రాంతంలో ఆస్తి, ప్రాణ, జంతువులు నష్టపడే ప్రమాదం ఉందని వెంటనే క్వారీపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం మానవ హక్కుల బృందం పలమనేరు డివిజన్ కార్యదర్శి మణి ఆధ్వర్యంలో తీర్థం గడ్డూరు వద్ద నిర్వహిస్తున్న అక్రమ క్వారీని చుట్టుపక్కల పంట పొలాలను, ప్రజలు ఎదుర్కొంటున్న నష్టాన్ని, హంద్రీ-నీవా కాలువకు జరిగే ప్రమాదాన్ని పరిశీలించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ క్వారీపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బైరెడ్డిపల్లి తహశీల్దారు ప్రసన్న కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంస్థ నాయకులు, 200 మంది పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


మృతుడి బంధువులతో చర్చిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

శ్మశానంలో ఆసక్తికర ఘటన!

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గం హిందూ శ్మశాన వాటికలో సోమవారం ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. గంగవరం మండలం పోలీస్ స్టేషన్ పరిధి పత్తికొండలో నాలుగు రోజుల క్రితం ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన సంగతి అందరికీ విదితమే. అతని కోసం బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసుల ఆదేశాల మేరకు హెల్పింగ్ హాండ్స్ సభ్యులు హిందూ సంప్రదాయ పద్ధతులతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా దీన్ని గమనించిన మృతుడి కుటుంబీకులు కర్ణాటక నుండి అంబులెన్స్‌తో సహా పలమనేరుకు వచ్చారు. కోలార్‌కు చెందిన బత్తెప్ప తమ బంధువు అని అనారోగ్య కారణాలు రీత్యా ఉరివేసుకున్నాడని వారు తెలిపారు. పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తీసుకెళ్లి అక్కడ ఖననం చేసుకుంటామని తెలపడంతో స్థానికులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు వారి కుటుంబీకులకు నచ్చజెప్పి హిందూ సంప్రదాయం ప్రకారమే అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని మళ్లీ తీయడం మంచిది కాదని చెప్పడంతో సర్దుకున్నారు. వారు చేసిన మంచి పనికి కృతజ్ఞతలు తెలుపుకుని 11 రోజుల తర్వాత నిర్వహించే కార్యక్రమాలు ఇక్కడే చేసుకుంటామని తెలిపి బయలుదేరి వెళ్లారు. ఈ ఘటన స్థానికంగా ఆసక్తికరంగా మారింది.


బస్ స్టాండులో రాళ్లను తొలగిస్తున్న ఆర్‌టిసి అధికారులు

రాళ్లు తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక బస్ స్టాండులో ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తున్న రాళ్లను బస్టాండు అధికారులు సోమవారం తొలగించారు. ఈనెల 25వ తేదీ శుక్రవారం 'ఆర్‌టిసి బస్టాండులో రోడ్లు గుంతలమయం' అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఆర్టిసి అసిస్టెంట్ డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ స్పందించారు. బస్టాండ్‌ను పర్యవేక్షించి వెంటనే తగు చర్యలు తీసుకొని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడే బస్టాండ్‌కు అడ్డంగా ఉన్న రాళ్లను కొన్ని తొలగించారు. మిగిలినవి డిపో మేనేజర్ తో మాట్లాడి పూర్తిగా తొలగిస్తామని, మట్టితో గుంతలు పూడ్చి వేస్తామని తెలిపారు. బస్టాండ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.